క్లుప్తంగా

ఆధార్‌తో అనుసంధానం తప్పనిసరి
పోస్టల్ సూపరింటెండెంట్ కృష్ణ



నల్లజర్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నగదు బదిలీ కోసం ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించినట్టు తపాలా శాఖ తాడేపల్లిగూడెం డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.కృష్ణ మంగళవారం విలేకర్లకు తెలిపారు. చాలా మందికి ఆధార్ అనుసంధానం లేకపోవడం వల్ల తపాలా శాఖ, సచివాలయ సిబ్బంది, ప్రభుత్వాధికారుల సమన్వయంతో జూన్ 5 నాటికి ఆధార్ సీడింగ్‌తో పాటు, ఎన్‌సీపీఐ లింకేజ్ ఖాతాలు తెరవడం, ఖాతాలు లేనివారికి నూతన పోస్టల్ బ్యాకింగ్ ఖాతాలు తెరవనున్నట్టు వివరించారు. ఆధార్ సీడింగ్ చేసిన పోస్టల్ సేవింగ్స్ ఖాతా ద్వారా ఏ తపాలా శాఖ నుంచైనా నగదు తీసుకోవచ్చన్నారు. వీటితో పాటు ఫోన్‌పే, గూగుల్‌పే వంటి యాప్‌లను లింక్ చేసి.. ఆన్‌లైన్ లావాదేవీలు చేసుకునే సౌకర్యం ఉందని తెలిపారు.

సాధికారత వైపు పయనించాలి



కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న కృష్ణవేణి

నల్లజర్ల: కౌమార బాలికలు సాధికారత వైపు పయనించాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ కృష్ణవేణి అన్నారు. మండలంలోని అనంతపల్లిలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కిశోరి వికాసంపై స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ, కౌమార బాలికలు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కిశోర బాలికలకు సరైన విజ్ఞానం అందించి, జీవితంలో అన్ని విధాలా ఎదిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఏఎన్‌ఎం గౌతమి మాట్లాడుతూ, ఆరోగ్యకర జీవన విధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మానవ అక్రమ రవాణా నిరోధం, బాల్య వివాహాల నిర్మూలన, ఆత్మరక్షణ, పిల్లలపై అకృత్యాలు, పోక్సో తదితర అంశాలపై గ్రామ మహిళా సంరక్షణాధికారి కనకదుర్గ వివరించారు. ఏఎన్‌ఎంలు దీప్తి, గౌతమి, అంగన్‌వాడీ కార్యకర్తలు బేబీ, అమ్మాజీ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెరవలి: దాతలు అందించే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకున్నప్పుడే వాటి లక్ష్యం నెరవేరుతుందని వైఎస్సార్ సీపీ నాయకుడు కుందుల భూపతిరావు, ఈయన సోదరుడు కుందుల గణపతి తెలిపారు. తీపర్రు గ్రామంలో రాజమండ్రికి చెందిన అకిరా కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక కుందుల నర్సింహమూర్తి, నాగరత్నం కమ్యూనిటీ హాలులో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 135 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 13 మందికి కంటి శస్త్రచికిత్సలు, 36 మందికి కళ్లజోళ్లు అవసరమున్నట్టు వైద్యులు గుర్తించారు. కంటి శస్త్రచికిత్సలు, కళ్లజోళ్లు దాతల సహకారంతో ఉచితంగా అందిస్తామని గణపతి, భూపతిరావు తెలిపారు.

మహనీయుల సేవలు ఆదర్శనీయం

నిడదవోలు: దేశ సేవలో అమరులైన మహనీయుల సేవలు నేటి సమాజానికి ఆదర్శనీయమని పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మేడవరపు భద్రం దొర అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, రమాబాయి భీమ్‌రావ్ అంబేడ్కర్, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్నం మురళీకృష్ణ, షేక్ నాగూర్, గుర్రం రమేష్, కాకి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

దేవరపల్లి: ఆర్డీడీఎస్ పనులు జరుగుతున్నందున గురువారం 33/11 కేవీ గౌరీపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో గౌరీపట్నం, 11 కేవీ ఫీడర్‌లోని దుద్దుకూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ(ఆపరేషన్స్) ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు గౌరీపట్నం, దుద్దుకూరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. అలాగే గౌరీపట్నం శివారు కొండగూడెంలో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

కందిపోయినట్టేనా..!

- అరకొరగా రేషన్ సరకుల పంపిణీ
- నాలుగు నెలలుగా కందిపప్పు నిల్
- అనేక గ్రామాల్లో బియ్యం, పంచదార మాత్రమే అందజేత
- కూటమి ప్రభుత్వ తీరుపై కార్డుదారుల ఆగ్రహం

నియోజకవర్గంలో ఇలా..

మండలం	రేషన్‌కార్డులు
నిడదవోలు టౌన్	11,208
నిడదవోలు	23,275
ఉండ్రాజవరం	21,912
పెరవలి	22,463



శంకరాపురంలో రేషన్ సరకులు తీసుకుంటున్న గ్రామస్తులు(ఫైల్)

నిడదవోలు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటాయి. రేషన్ డిపోల ద్వారా సరకులు అరకొరగా సరఫరా చేయడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పేదవాని ఇంట్లో కందిపప్పు కనుమరుగవ్వగా, మార్కెట్‌లో నిత్యావసరాలు కొనుక్కునే స్తోమత లేక ఆర్థికంగా తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. సరకుల పంపిణీ మాట అటుంచితే.. ఎండీయూ వాహనాలను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం లబ్ధిదారులకు మింగుడు పడడం లేదు.

కందిపప్పు కనుమరుగు

మార్కెట్‌లో కందిపప్పు ధర గణనీయంగా పెరిగింది. పౌర సరఫరాల శాఖ ద్వారా కందిపప్పు తీసుకోవాలన్న రేషన్ కార్డుదారుల ఆశపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి కందిపప్పు పంపిణీకి మంగళం పాడింది. నాలుగు నెలలుగా బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ అవుతోంది. కనీసం మే నెలలో అయినా కందిపప్పు ఇస్తారని కార్డుదారులు ఆశగా ఎదురుచూశారు. నాలుగు నెలలుగా కందిపప్పు ఇవ్వకపోవడంపై కార్డుదారులు మండిపడుతున్నారు. బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు ధర రూ.160 నుంచి రూ.180 పలుకుతోంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కిలో రూ.67కు కందిపప్పు లభిస్తుండడంతో కొంతవరకు సంతృప్తి చెందేవారు. ఈ ఏడాది జనవరి తర్వాత కందిపప్పు పంపిణీకి ప్రభుత్వం చేతులెత్తేయడంతో పేద, మధ్య తరగతి వర్గాల్లో ఆందోళన నెలకొంది.

రేషన్ బియ్యంతో సరి

ప్రతి నెలా రేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. పంచదార అరకొరగా ఇస్తున్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డిపో ద్వారా అన్ని రకాల పప్పులు రాయితీ ధరలకు ఇస్తామని,



కందిపప్పు

సంక్రాంతి కానుకలు అందిస్తామని కూటమి నాయకులు ఊదరగొట్టారు. కానుకల మాట అటుంచితే, ప్రతి నెలా ఇచ్చే సరకులు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని లబ్ధిదారులు మండిపడుతున్నారు. ప్రజలకిచ్చిన హామీల అమలుపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించడం లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. నాలుగు నెలల నుంచి బియ్యం, చక్కెర మినహా మిగిలిన సరకులు ఇవ్వడం లేదని చాలా గ్రామాల్లో కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కందిపప్పు రాకపోవడంపై డీలర్లను నిలదీస్తున్నారు. అధికారులు మాత్రం స్టాకు రావాల్సి ఉందని చెబుతున్నారు.

నాలుగు నెలలుగా ఇవ్వడం లేదు



రేషన్ సరకులు సక్రమంగా సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. నాలుగు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. జనవరిలో ఇచ్చారు. వచ్చే నెలలో అయినా కందిపప్పు పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బి.వరలక్ష్మి, ఇందిరానగర్, నిడదవోలు టౌన్

పేదలపై చిన్నచూపు తగదు



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఒక్క హామీని కూడా నెరవేర్చలేదు. కనీసం కందిపప్పు కూడా కార్డుదారులకు ఇవ్వడం లేదు. బయట మార్కెట్‌లో కొందామంటే ధరలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం కనీసం కందిపప్పు కూడా ఇవ్వకపోతే పేదలు ఎలా బతకాలి.

– షేక్ నూర్జహాన్, వైఎస్సార్ నగర్, నిడదవోలు టౌన్

నేడు ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

చాగల్లు: మండలంలో బ్రాహ్మణగూడెం మెయిన్ రోడ్‌లో నూతనంగా నిర్మించిన 28 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా బుధవారం విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామానికి చెందిన దాపర్తి సత్యనారాయణ, గోపాల కృష్ణవేణి దంపతులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన స్వామివారి విగ్రహం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం గ్రామంలో భారీ అన్న సమారాధన నిర్వహిస్తున్నారు.

ఎక్సైజ్ దాడుల్లో ఇద్దరి అరెస్టు

నల్లజర్ల/దేవరపల్లి: సింగరాజుపాలెం, పల్లంట్ల గ్రామాల్లో దాడులు నిర్వహించి ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. పల్లంట్లలో సారా విక్రయిస్తున్న నల్లజర్ల మండలానికి చెందిన వంగ మంగను అరెస్టు చేసి, ఆమె వద్ద ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సింగరాజుపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బొల్లా అనిల్ కుమార్‌ను అరెస్ట్ చేసి, అతని వద్ద ఉన్న మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ చెప్పారు. సర్కిల్ పరిధిలో ఎక్కడైనా మద్యం అక్రమ విక్రయాలు, సారా అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యోగా సాధనతో ఆరోగ్యం



తాళ్లపూడిలో యోగా చేస్తున్న ఉద్యోగులు



చాగల్లు ఎంపీడీవో కార్యాలయంలో యోగా చేస్తున్న సచివాలయ సిబ్బంది

తాళ్లపూడి: ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని, యోగా సాధనతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని యోగా గురువు నక్కా వేంకటేశ్వరరావు అన్నారు. యోగా ఆంధ్రా మాసోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగా సాధన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో వివిధ శాఖల సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు యోగాసనాలు వేశారు. యోగా గురువు వేంకటేశ్వరరావు పర్యవేక్షణలో సూర్యనాడి, చంద్రనాడి, వృక్షాసనం, పర్వతాసనం, భంగిమల్లో యోగా చేశారు. నిత్యం గంట పాటు ధ్యానం, యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని వేంకటేశ్వరరావు తెలిపారు. కఠినమైన ఆసనాలు అవసరం లేదని, సులభంగా సాధన చేయవచ్చన్నారు. తహసీల్దార్ మోహనభారతి, ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో కేఎస్ వీరన్న, సూపరింటెండెంట్ నిర్మల, వైద్యాధికారి భవాని, పోలీసు సిబ్బంది ముద్దయ్య, లలిత, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్యానంతో ఏకాగ్రత సాధ్యం

పెరవలి: విజ్ఞానం అనేది గ్రంథాలయాల్లోనే లభిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని లైబ్రేరియన్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. వేసవి శిక్షణలో భాగంగా ఆదివారం ముక్కామల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విశ్వనాథం

పిరమిడ్ మాస్టారు కరుటూరి విశ్వనాథం మాట్లాడుతూ, విద్యార్థులు ఆటపాటలతో పాటు, ధ్యానం నేర్చుకుంటే వారిలో జ్ఞాపక శక్తి వృద్ధి చెందుతుందన్నారు. చదువుపై ఏకాగ్రత పెరిగి ఉన్నత స్థితికి వెళ్లవచ్చన్నారు. పుస్తక పఠనం ద్వారా సమాజంలో మంచిచెడు అనే విషయాలు తెలుస్తాయని చెప్పారు. గ్రంథాలయాల్లో నిత్యం పుస్తకాలు చదివేలా అలవాటు చేసుకోవాలన్నారు. అలాగే పెరవలి గ్రంథాలయంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

మానసిక ప్రశాంతత లభ్యం

చాగల్లు: యోగా వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యోగా వల్ల ఇంద్రియాలను అధీనంలో ఉంచుకుని, జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకోవచ్చన్నారు. మాస్టర్ ట్రైనర్ గణేష్ పలు యోగాసనాలను వివరించారు. సచివాలయ సిబ్బంది యోగాసనాలు వేశారు.

ప్రత్యేక అవసరాల చిన్నారులపై సర్వే

- వచ్చే నెల 9 వరకు నిర్వహణ



నల్లజర్లలో సర్వే నిర్వహిస్తున్న ఐఈఆర్‌పీ రక్షిత

నల్లజర్ల: ఇంటికే పరిమితం కాకుండా ప్రత్యేక అవసరాల చిన్నారులను శారీరకంగా, మానసికంగా బలోపేతం చేసి, విద్యాబుద్ధులు నేర్పించేందుకు భవిత కేంద్రాలు దోహదపడుతున్నాయి. వీరు కూడా మిగిలిన పిల్లల్లాగే అన్ని అవకాశాలు అందిపుచ్చుకునేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతి మండలంలో భవిత కేంద్రం ఏర్పాటు చేసి, సహిత విద్యను అందిస్తోంది. నల్లజర్లలో నంబరు-3 ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆశించిన మేరకు ఫలితాలు రావడంతో, ఇంకా మిగిలిన ప్రత్యేక అవసరాల పిల్లల్ని గుర్తించేందుకు సహిత విద్య ఐఈఆర్‌పీ రక్షిత సర్వే చేపట్టారు. ఈ నెల 13 నుంచి జూన్ 9 వరకు 18 ఏళ్లలోపు ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ఈ సర్వే జరుగుతోంది. ఇంక్లుజన్-2025లో భాగంగా ప్రత్యేక అవసరాల పిల్లలందరికీ అవసరమైన విద్యను అందించడం, ప్రతి చిన్నారిని వారి వయస్సుకు తగ్గట్టుగా పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా సర్వే జరుగుతోందని రక్షిత తెలిపారు.

నాలుగు రకాల అలవెన్సులు

ప్రత్యేక అవసరాల పిల్లలకు నాలుగు రకాల అలవెన్సులు ప్రభుత్వం అందిస్తుంది. ఇందులో ఎస్కార్ట్, ట్రాన్స్‌పోర్ట్, హోమ్ బేస్డ్, గర్ల్ చైల్డ్, రీడర్ అలవెన్సులు ఉన్నాయి. అంధులకు రీడర్ అలవెన్స్‌గా పది నెలలకు రూ.2 వేలు అందిస్తున్నారు. బడికి వచ్చేవారికి ఎస్కార్ట్ అలవెన్సుగా ఒక్కో విద్యార్థికి పది నెలలకు రూ.3 వేలు ఇస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌గా పది నెలలకు రూ.3 వేలు, గర్ల్ చైల్డ్ అలవెన్సుగా రూ.2 వేలు, హోమ్ బేస్డ్ అలవెన్సుగా రూ.3 వేలు అందిస్తున్నారు.

తొమ్మిది మంది గుర్తింపు

భవిత కేంద్రాల పరిధిలో విద్యతో పాటు, వారికి అవసరమైన సేవలు అందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్టు ఎంఈఓ వై.సత్యనారాయణ తెలిపారు. మండలంలో గతంలో 90 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ఉన్నారని చెప్పారు. కొత్తగా తొమ్మిది మందిని గుర్తించామన్నారు.

బుద్ధుని బోధనలు మార్గదర్శకాలు



జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉండ్రాజవరం: కాలాతీతంగా బుద్ధుని బోధనలు ప్రపంచానికి మార్గదర్శకాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు యాళ్ల బండిస్వామి అన్నారు. టెన్త్ పరీక్షా ఫలితాల్లో మండలంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్థానిక మైత్రేయ బుద్ధ విహార్‌లో మంగళవారం సంఘ మండల శాఖ తరఫున ప్రతిభా పురస్కారాలు అందించి, హెచ్‌ఎంలను సత్కరించారు. మండల తొలి మూడు స్థానాలు పొందిన సూర్యారావుపాలెం హైస్కూల్ హెచ్‌ఎం జి.పాల్ ప్రకాశం, చివటం స్కూలు హెచ్‌ఎం ఈ.ఏడుకొండలు, వేలివెన్ను స్కూలు హెచ్‌ఎం కేఎల్ గణేష్‌ను జ్ఞాపికలతో సత్కరించారు. మండలంలో 571 మార్కులు పొందిన ఉండ్రాజవరం స్కూలు విద్యార్థిని కరెళ్ల నవ్యశ్రీ, 560 మార్కులు సాధించిన సత్యవాడ స్కూలు విద్యార్థిని కత్తుల కుసుమ, 558 మార్కులు పొందిన సత్యవాడ స్కూలు విద్యార్థి కలవకుంట్ల సూర్యతేజతో, స్కూలు ఫస్ట్ సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు యివ్వల రాంబాబు, బి.రామారావు, ఎస్.లక్ష్మీనారాయణ, తాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ రవాణా కార్యాలయం తనిఖీ



దేవరపల్లి ఆర్టీసీ రవాణా కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్

దేవరపల్లి: రాజమహేంద్రవరం అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కె.మాధవ్ స్థానిక ఆర్టీసీ రవాణా కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఆర్టీసీ ద్వారా పార్శిళ్లను పంపించడం వల్ల సురక్షితంగా, వేగవంతంగా గమ్యస్థానాలకు చేరుతాయని ఆయన తెలిపారు. రవాణా కార్యాలయం నిర్వాహకులకు ఆదాయం పెంచుకునే మార్గాలపై పలు సూచనలు చేశారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఆర్టీసీ రాజమహేంద్రవరం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ పాల్గొన్నారు.

థియేటర్లు కచ్చితంగా మార్గదర్శకాలను పాటించాలి

- ఆర్డీవో రాణి సుస్మిత



కొవ్వూరులో ఓ థియేటర్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో

తాళ్లపూడి(కొవ్వూరు): ప్రభుత్వ మార్గదర్శకాలను థియేటర్లలో కచ్చితంగా పాటించాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత స్పష్టం చేశారు. కొవ్వూరు పట్టణంలోని వై స్క్రీన్స్, అనన్య థియేటర్లను మంగళవారం తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, అగ్నిమాపక, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో కలిసి ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. థియేటర్లలో ఆహార పానీయాల నాణ్యత, అధిక ధరకు తినుబండరాల విక్రయాలు, థియేటర్ ఫిట్‌నెస్, ఫైర్ సేఫ్టీ, బ్లాక్ టికెట్ల వ్యవహారం, శానిటేషన్, నిర్వహణ తీరు తదితర అంశాలపై క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి యాజమాన్యాలు థియేటర్ల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. థియేటర్లలో ఆహార, పానీయాల ధరలపై నియంత్రణ ఉండాలన్నారు. టికెట్ల ధరలను బహిరంగంగా ప్రదర్శించాలన్నారు. సినిమా హాళ్లలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఎటువంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా విద్యుత్ సరఫరా వ్యవస్థ పటిష్టపర్చి, అగ్ని ప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉంచాలన్నారు. అగ్నిమాపక యంత్రాలు, థియేటర్‌లో నిర్వహణ వ్యవస్థ, బేస్‌మెంట్ వైశాల్యం, ఆటోమేటిక్ స్ప్రింక్లర్ సిస్టమ్, మాన్యువల్‌గా ఎలక్ట్రిక్ ఫైర్ అలారం సిస్టమ్, టెర్రస్ లెవెల్ వాటర్ స్టోరేజ్ ట్యాంక్, ఎలక్ట్రికల్ పంపు సామర్థ్యం వంటి వాటిపై ఆర్డీవో ఆరాతీశారు. వై స్క్రీన్స్‌లో టికెట్ల ధరలు బహిరంగంగా ప్రదర్శించాలని, అనన్య థియేటర్‌లో శానిటేషన్ నిర్వహణపై చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఆమె వెంట పలువురు అధికారులు ఉన్నారు.

రెండిళ్లలో చోరీ

తాళ్లపూడి(కొవ్వూరు): వేర్వేరు ప్రాంతాల్లోని రెండిళ్లలో చోరీ సంఘటనలు చోటుచేసుకున్నాయి. శుభకార్యానికి వెళ్లి తిరిగొచ్చేసరికి ఇంటిని దొంగలు కొల్లగొట్టిన సంఘటన కొవ్వూరు మండలం కాపవరంలో సోమవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు, గ్రామానికి చెందిన దువ్వాపు రామారావు ఇంటికి తాళం వేసి.. కుటుంబ సమేతంగా ఓ శుభకార్యానికి వెళ్లారు. దొంగలు ఇంటి వెనుక వైపు తలుపు చాకచక్యంగా తీసి, లోనికి ప్రవేశించారు. బీరువా తాళాలు పగులగొట్టి రెండు కాసుల బంగారు ఆభరణాలు, పది తులాల వెండి వస్తువులు చోరీ చేశారు. రామారావు కుటుంబ సభ్యులు సాయంత్రం ఇంటికి తిరిగొచ్చేసరికి చోరీ జరిగినట్టు గుర్తించారు. ఈ మేరకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మలకపల్లిలో..

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లిలో ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం, మలకపల్లి గ్రామానికి చెందిన జమ్ముల వీరవెంకట సత్యనారాయణ ఈ నెల 8న రాజమహేంద్రవరంలోని బంధువుల ఇంట్లో జరుగుతున్న వివాహానికి వెళ్లారు. ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు.. బీరువాలో ఉంచిన 900 గ్రాముల వెండి వస్తువులను అపహరించారు. నాలుగు రోజుల తర్వాత ఇంటికి తిరిగొచ్చిన సత్యనారాయణ.. ఇంట్లో చోరీ జరిగినట్టు గమనించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అగ్ని బాధితురాలికి ఆర్థిక సాయం



వృద్ధురాలికి ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

ఉండ్రాజవరం: అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి, ఒంటరిగా ఉంటున్న వృద్ధురాలికి పలువురు చివటం గ్రామస్తులు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. గ్రామానికి చెందిన నీలం తులసమ్మ నివసిస్తున్న పూరిల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. దీంతో ఆమె సర్వం కోల్పోయింది. నిలువ నీడ లేకపోవడంతో తన కుమార్తె ఇంటిలో ఆశ్రయం పొందింది. విషయం తెలుసుకున్న హైదరాబాద్‌లో ఉంటున్న చివటం గ్రామానికి చెందిన నీలం ప్రసాద్, నీలం గోపాల్ సోదరులు రూ.5,500తో పాటు, సైకిల్ షాప్ వీర్రాజు, కేబుల్ పోలరాజు, ఐస్‌క్రీమ్ రామకృష్ణ ఇచ్చిన నగదుతో మొత్తం రూ.7,500ను ఆమెకు అందజేశారు. దాతలకు తులసమ్మ కృతజ్ఞతలు తెలిపింది.

అసంపూర్తి పనులకు బిల్లులు చెల్లిస్తారా..!

- డ్రైన్ల పూడికతీత అంశంపై సభ్యుల అభ్యంతరం
- పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి
- కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రత్నకుమారి



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

తాళ్లపూడి (కొవ్వూరు): కౌన్సిల్ సమావేశంలో డ్రైన్లలో పూడికలు తొలగించలేదని, సభ్యులకు సమాచారమివ్వడం లేదని, బిల్లులపై అభ్యంతరాలు తెలపడం సహా పట్టణంలోని పలు సమస్యలపై సభ్యులు కౌన్సిల్ సమావేశంలో నిలదీశారు. కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన మంగళవారం జరిగింది. కమిషనర్ టి.నాగేంద్రకుమార్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు అనేక సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. తొలుత పదో వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ బత్తి నాగరాజు మాట్లాడుతూ, ఒకటి నుంచి 11వ వార్డు వరకు డ్రైన్ పూడికతీత పనులు అసంపూర్తిగా చేపట్టారని, రూ.15 వేల బిల్లులు ఎలా పెడతారని ప్రశ్నించారు. పనులు పూర్తి చేసేవరకూ బిల్లులు ఆపాలని డిమాండ్ చేశారు. ఒకటో వార్డు కౌన్సిలర్ బొండాడ సత్యనారాయణ మాట్లాడుతూ, పట్టణంలోని డ్రైన్లలో ఎక్కడా పూడికలు తొలగించినట్టు లేదన్నారు. దీనిపై నిజ నిర్ధారణ కమిటీ వేయాలన్నారు. అదేవిధంగా జనావాసాల్లోని డ్రైన్లలో పూడికలు తీయలేదని 16వ వార్డు కౌన్సిలర్ కండెల్లి రామారావు ఆరోపించారు. పుంతల్లో పూడికలు తొలగించాలరని, పట్టణంలో డ్రైన్లు నిండిపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఔరంగాబాద్ నుంచి దిగువకు పోయే మేజర్ అవుట్‌లెట్ డ్రెయిన్ ఆక్రమణకు గురైందని, మురుగు నీరు పారడం లేదన్నారు. నాలుగేళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై కమిషనర్ నాగేంద్రకుమార్ సమాధానమిస్తూ, ఔరంగాబాద్ మేజర్ డ్రెయిన్‌పై తోగుమ్మి రైతులు కోర్టులో కేసు వేశారని చెప్పారు. ఇంటర్నల్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు వేయరాదని కోర్టు స్టే ఉందని తెలిపారు. వేగ నియంత్రణకు చర్యలు తీసుకుంటామన్నారు.

గోష్పాద క్షేత్రంపై చర్చ

వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ కోడూరి శివరామకృష్ణ మాట్లాడుతూ, ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న గోష్పాద క్షేత్రంలో పారిశుధ్యం క్షీణించిందనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ప్రత్యేకంగా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని కోరారు. కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ, వార్డుల్లో ఏ పనులు చేపట్టినా సభ్యులకు సమాచారమివ్వాలని చాలా సార్లు చెప్పినా.. అలా జరగడం లేదన్నారు. గోష్పాద క్షేత్రానికి ఆదివారం భక్తులు ఎక్కువగా వస్తారని, పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా మద్దిపట్ల సాయిగీత మాట్లాడుతూ, తమ వార్డులో 2023లో మంజూరైన నాలుగు పనులు చేపట్టలేదని, త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలన్నారు. సభ్యులు లేవనెత్తిన పలు సమస్యలపై చర్యలు తీసుకుంటామని చైర్‌పర్సన్ రత్నకుమారి తెలిపారు. సమావేశంలో 14 అంశాలతో కూడిన అజెండాను, మూడు అంశాలపై టేబుల్ అజెండాను ఆమోదించారు. రెండో అంశాన్ని పలువురు కౌన్సిలర్లు అభ్యంతరం తెలపడంతో వాయిదా వేస్తున్నట్టు చైర్‌పర్సన్ తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.